సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఘన సత్కారం



సంగీత కళాకారిణి నడింపల్లి లక్ష్మీసౌజన్యను సత్కరిస్తున్న అకాడమీ ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆల్ ఇండియా రేడియో ద్వారా గుర్తింపు పొందిన 67 మంది బి–హై గ్రేడ్ కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా మద్దిలపాలెం భానునగర్‌కు చెందిన ఆల్ ఇండియా బి హై గ్రేడ్ సంగీత కళాకారిణి నడింపల్లి లక్ష్మీసౌజన్యను అకాడమీ ప్రతినిధులు ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రం అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత సత్యనారాయణకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మాధవధార ప్రాంతానికి చెందిన పి.ఉమా వెంకట సత్యనారాయణ లక్షా 5 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయ డొనేషన్ కౌంటర్లో ఇచ్చారు. దేవస్థానం తరపున అన్నప్రసాద విభాగం ఏఈవో ఆనంద్‌కుమార్, పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్ అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామి

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల్లో భాగంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతపై ప్రవచనాలు అందించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి వార్లను దర్శించుకున్నారు.

శాకంబరిగా ఎర్నిమాంబ



కంచరపాలెం: కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం–అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి మారువారం జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ ప్రత్యేకంగా అమ్మవారికి అలంకరణ చేశారు. నగరంతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కళావిహీనం..!



చినవాల్తేర్ పిల్లల పార్కు



ఆట పరికరాల వద్ద గోతులు

అధ్వానంగా చినవాల్తేర్ పిల్లల పార్కు

శిథిలమైన ఆట పరికరాలు, ఫ్లోర్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

టీచర్స్‌కాలనీ (బీచ్‌రోడ్డు): జీవీఎంసీ 21వ వార్డులోని చినవాల్తేర్ పిల్లల పార్కు కళావిహీనంగా తయారైంది. దానిలో లక్షల రూపాయలతో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, వ్యాయమ పరికరాలు శిథిలమయ్యాయి. దీంతో పిల్లలు ఈ పార్కుకు రాకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొంత మంది ఇక్కడ చేరి మద్యం తాగడం వంటివి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పిల్లలకు ఆనందాన్ని ఇచ్చే ఈ పార్కు కాస్త.. ఆకతాయిలు, మందుబాబులకు నిలయంగా మారింది.

గత ప్రభుత్వంలో అభివృద్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో అనేక పార్కులను అభివృద్ధి చేసింది. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చిన్న చిన్న పార్కులను తీర్చిదిద్దింది. ప్రతి పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పెద్దల ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. ఆట వస్తువులు పాడైపోతున్నా.. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో చిన్నారులు పార్కులకు రావడం మానేస్తున్నారు.



పిల్లల పార్కులో కనిపించని ఊయలలు



జారుడు బల్లకు భారీ రంధ్రం

పార్కు నిర్వహణ గాలికి..

ఈ పార్కు నిర్వహణను జీవీఎంసీ అధికారులు గాలికొదిలేయడంతో ఆట వస్తువులు పూర్తిగా శిథిలమవుతున్నాయి. వాలీబాల్ కోసం రూపొందించిన కోర్టు మొత్తం ఫ్లోర్ ఊడి కొట్టుకుపోయింది. జారుడు బల్లలు పెద్ద పెద్ద రంధ్రాలతో దర్శనమిస్తున్నాయి. చిన్నారులు ఊగే ఊయలలు కనిపించడం లేదు. పార్కులో ఆడుకునే అవకాశం లేకపోవడంతో చిన్నారులు రావడం మానేశారు.



పిల్లల పార్కులో తాగిపడేసిన మద్యం సీసాలు

వ్యాయామం చేయాలంటే భయం..

ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల పార్కులో వ్యాయామం చేయాలంటే స్థానికులు భయపడుతున్నారు. చినవాల్తేర్ పార్కు మొత్తం బురద బురదగా ఉండటంతోపాటు అధ్వానంగా దర్శనమిస్తోంది. దీంతో ఎవరూ ఇక్కడ వ్యాయామం చేయడానికి ఆసక్తి చూపడం లేదు. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి పార్కును ఆధునికీకరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్కులో మద్యం సీసాలు..

అధ్వానంగా తయారైన ఈ పార్కులోకి స్థానికులు, పిల్లలు రాకపోవడంతో మందుబాబులు తమకు అడ్డాగా మార్చుకున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పార్కులో కూర్చొని మద్యం తాగుతున్నారని, ఆందోళనగా ఉందని, స్థానికులు చెబుతున్నారు. పార్కులో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనం. పోలీసులు దృష్టి సారించి పిల్లల పార్కులో ఇటువంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



పూర్తిగా పాడైన వాలీబాల్ కోర్టు

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీ బలోపేతం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

'తూర్పు' సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 23వ వార్డు సీతమ్మధారలోని పార్టీ తూర్పు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, పలు అనుబంధ సంఘాల నాయకులు పార్టీని బూత్ లెవల్ నుంచి బలోపేతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తలో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపాల్సిన అవసరముందన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తరువాత వార్డుల్లో కొంత మంది కార్యకర్తలు నిరాశ, నిస్పృహతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని గుర్తించామన్నారు. వారిని మనందరం కలుపుకొని కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో మన పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పార్టీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు కార్యకర్తలతో మమేకం కావాలని మొల్లి అప్పారావు కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు ముచ్చల లక్ష్మి, ఉమ్మిడి దాసు, జిల్లా పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు పేర్ల విజయచందర్, వల్లా దుర్గారావు, అల్లంపల్లి రాజబాబు, పీతల గోవింద్, బోని శివరామకృష్ణ, మార్కండేయులు, సుబ్రహ్మణ్యం, నీలారెడ్డి, పతివాడ కనకరాజు, మదుపాడ రవి, సూర్యనారాయణరెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, చొల్లంగి నాగేశ్వరరావు, బోండా ఉమామహేశ్వరరావు, కొండారెడ్డి, రమణరెడ్డి, పోలిరెడ్డి, త్రినాథ్, జేమ్స్ పాల్గొన్నారు.

గెడ్డలు ఇలా.. మురుగు ప్రవాహమెలా?





ఎంవీపీ టీటీడీ కల్యాణ మండపాన్ని ఆనుకుని ఉన్న గెడ్డలో భారీగా వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపాన్ని ఆనుకుని ఉన్న గెడ్డలో పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయింది. కొంతకాలంగా దీనిలోని చెత్తను తీయకపోవడంతో ఈ సమస్య తలెత్తగా.. తాజాగా కురిసిన వర్షాల కారణంగా వ్యర్థాలు భారీగా కొట్టుకురావడం, పక్కనే ఉన్న కల్వర్ట్ వద్ద నిలిచిపోవడంతో పూడిక పెరిగిపోయింది. దీంతో అక్కడ నీటి ప్రవాహం సైతం జామైంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా.. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంతో రోజురోజుకూ సమస్య జఠిలమవుతోందని స్థానికులు చెబుతున్నారు. మురుగు నీటి ప్రవాహం నిలిచిపోయిన కారణంగా వ్యర్థాలు దుర్వాసన వెదజల్లుతున్నాయని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. వ్యర్థాల గెడ్డ పొడవునా నిలిచిపోవడంతో దుర్గంధం తాళలేకపోతున్నట్లు చెబుతున్నారు. కాలనీలోని పలు గెడ్డల్లో పరిస్థితి ఇలానే ఉందని, పారిశుధ్య అధికారులు స్పందించి పూడిక తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. అయితే ఆ గెడ్డను ఆనుకొని, కల్వర్ట్ చుట్టూ వ్యాపారుల బడ్డీల ఉండటంతో వ్యర్థాల తొలగింపు ఎలా సాధ్యమనే ప్రశ్న సైతం వ్యక్తమవుతోంది.

బీచ్‌లో మెరైన్ ఎస్‌ఐ పర్యటన



పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్‌ఐ మురళీకృష్ణ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌ను ఆదివారం ఉదయం మెరైన్ పోలీసులు సందర్శించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగరానికి రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు మెరైన్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీకృష్ణ పర్యాటకులు, మత్స్యకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భద్రత దృష్ట్యా ప్రతిరోజు ఎంతమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శిస్తున్నారు, మత్స్యకారుల పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతోపాటు, బీచ్ పరిసరాల్లో స్థానికేతరుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు ఎవరైనా తీర ప్రాంతాల్లో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.

ఆలయాల పేరుతో ఆక్రమణలు

- 13వ వార్డు జీవీఎంసీ స్థలంలో అనధికార నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆలయాల పేరుతో కొందరు ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద స్థలాన్ని భాగాలుగా చేసి ఆక్రమిస్తున్నారు. వాటిలో ఆలయాలు నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక్కడ లాస్ట్ బస్టాప్ సమీపం కంబాలకొండ వెనుక భాగాన్ని ఆనుకొని జీవీఎంసీకి చెందిన సుమారు ఎకరం ఖాళీ స్థలం ఉంది. దీనికి, కంబాలకొండకు మధ్య అటవీ శాఖ అధికారులు ట్రెంచ్ కూడా ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో గతంలో కొన్నాళ్లుగా జీవీఎంసీ కల్యాణ మండపం నిర్మించింది. ఆరేళ్ల కిందట దాని పక్కన జీవీఎంసీ ముస్లింలకు మసీదు, క్రిస్టియన్ ఫంక్షన్ హాల్ నిర్మాణాలు చేపట్టింది. వాటి పక్కన మిగిలిన ఖాళీ స్థలంలో ఇప్పుడు కొందరు గుడుల పేరుతో ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కనక్య కాపరమేశ్వరి ఆలయం నిర్మాణం చేపడతామంటూ ఓ వర్గం వారు కొంత స్థలాన్ని చదును చేశారు. అక్కడ ఆలయం నిర్మాణం కోసం సిద్ధమయ్యారు. దీనికి పక్కనే వారం కిందట నుంచి జగన్నాథ స్వామి ఆలయం కోసం మరో వర్గం రేకుల షెడ్ నిర్మిస్తోంది.



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద ప్రభుత్వ స్థలంలో జరుపుతున్న కన్యకాపరమేశ్వరి ఆలయ పనులు

వారు ఆపితేనే.. మేం ఆపుతాం

ప్రజా అవసరాలకు ఉపయోగపడే జీవీఎంసీ స్థలంలో ఆలయాలు నిర్మిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. వీటిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం ఆరో నంబర్ సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ ఆ స్థలం వద్దకు వెళ్లి కన్యకా పరమేశ్వరి ఆలయం కోసం స్థలం చదును చేస్తున్న పనులు నిలిపేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. వారం రోజులుగా జగన్నాథ స్వామి ఆలయం కోసం నిర్మిస్తున్న రేకుల షెడ్ పనులు ఆపించిన తర్వాతే.. తమ పనులు నిలిపేస్తామని, లేదంటే ఇక్కడ ఆలయం నిర్మిస్తామంటూ ఖరాఖండిగా వారు తేల్చిచెప్పారు.



జీవీఎంసీ స్థలంలో జగన్నాథ స్వామి ఆలయం కోసం నిర్మించిన రేకుల షెడ్

దీంతో జగన్నాథ స్వామి ఆలయం పనుల కూడా నిలిపేయాలని నిర్వాహకులకు సచివాలయ సెక్రటరీ సూచించారు.

ఒకరిని చూసి మరొకరు..

మరో వ్యక్తి ఇక్కడ కొంత స్థలాన్ని చదును చేసి పిల్లలకు కరాటే శిక్షణ ఇస్తున్నాడు. ఫీజు వసూలు చేసి జీవీఎంసీ స్థలంలో శిక్షణ ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఒకరిని చూసి మరొకరు ఆలయాల పేరుతో రూ.కోట్లు విలువైన జీవీఎంసీ స్థలాలను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోతే కొద్ది రోజులకు ఇక్కడి స్థలమంతా ఆక్రమణకు గురయ్యే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు.

హృదయపూర్వక సమర్పణమే 'శ్రీకృష్ణ అర్పణం'



నృత్య ప్రదర్శనలో మురళీనగర్ కళాకారులు

తగరపువలస: శ్రీకృష్ణునికి హృదయపూర్వక సమర్పణ అందించే కార్యక్రమమే 'శ్రీ కృష్ణ అర్పణం' అని, అందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని అంబరీష దాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలోని శ్రీరాధా మదన్‌మోహనుల మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 వరకు శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమం కనులపండువగా జరిగింది. మురళీనగర్‌కు చెందిన శ్రీ సంజన కూచిపూడి నృత్యాలయం కళాకారులు సంగీతసేవ నిర్వహించారు.

హైవేపై ఆటోను ఢీకొట్టిన కారు

ఆరుగురికి గాయాలు, ఆస్పత్రిలో చికిత్స

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.. అగనంపూడికి చెందిన భాస్కర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం పలాసలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బయలుదేరాడు. ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకునేందుకు వీరంతా ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అగనంపూడి నుంచి ఆటోలో వస్తున్నారు. తాటిచెట్లపాలెం సమీపంలో వారి ఆటోను రైల్వే న్యూకాలనీ రోడ్డు నుంచి వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కారు ఢీకొనడంతో ఆటో దెబ్బతింది. ఆటో డ్రైవర్ కె.కాశీరావు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఉమామహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కారు ఢీకొట్టంతో దెబ్బతిన్న ఆటో

ఆకట్టుకున్న 'అష్టలక్ష్మీ వైభవం'



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో అష్టలక్ష్మీ వైభవం కూచిపూడి నృత్యాంశం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇంకా.. తెలుగు పద కవితా పితామహుడు అన్నమయ్య విరచిత ముద్దుగారే యశోదా.., గరుడ గమన, నారాయణతే నమోనమో తదితర కీర్తనలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చంద్ర చూడ.., అయిగిరినందిని.., స్వాగతం కృష్ణా.., దీపా తారంగిని.., శంభో శంకర తదితర గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. గీతా మిత్ర నృత్య దర్శకత్వంలో కళాకారులు పవిత్ర, మోక్షజ్ఞ, లక్ష్మీ ప్రణతి, జాస్మిక వీటిని ప్రదర్శించారు.

